ప్రజాశక్తి

ఆదివారం 14 ఏప్రిల్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వార్త 4లో..



మాట్లాడుతున్న సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు

విశాఖ పోర్టుతో సమానంగా వేతనాలు చెల్లించాలి

అదానీ గంగవరం పోర్టు కార్మికుల ఆందోళనలో జగ్గునాయుడు డిమాండ్

యుసిడిలో ముగ్గురు సిఒలు సస్పెన్షన్

- ఎపిడికి షోకాజ్
- ఎన్నికల విధుల నుంచి తొలగించిన కలెక్టర్

వార్త 2లో..

నేడు బాబు ప్రజాగళం సభలు

వార్త 2లో..

అమల్లోకి చేపల వేట నిషేధం

రేపటి నుంచి ఒడ్డుకే బోట్లు పరిమితం
కొత్త ప్రభుత్వం కొలువుదీరాకే పరిహారం ?
61 రోజులపాటు మత్స్యకారుల ఉపాధికి ఇబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి



విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సముద్రంలో చేపల వేట నిషేధం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు అమలుకానుంది. చేపల వేట నిషేధ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం, మత్స్యకారుల పరిహారం చెల్లింపుపై మాత్రం ఇంతవరకు స్పష్టమైన ఆదేశాలివ్వలేదు. చేపలవేటపై ఆధారపడ్డ మత్స్యకారుల గుర్తింపు జాబితా తయారీకి చర్యలు చేపట్టలేదు. 61 రోజుల పాటు చేపల వేట నిషేధం అమలుకావడంతో సముద్రంలో మెకనైజ్డ్, మోటర్ బోట్లలో చేపల వేటకు వెళ్లే అవకాశం మత్స్యకారులకు లేదు. దీంతో వారి ఉపాధిపై దెబ్బ పడనుంది.

వాస్తవానికి మే నెలలో వేట నిషేధ పరిహారం ఒక్కొక్క మత్స్యకారునికీ రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం ద్వారా మత్స్యకార అభివృద్ధి శాఖ నుంచి అందాల్సి ఉంది. కానీ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది పరిహారం పంపిణీ ఆలస్యం కానుంది. '2024 ఎన్నికల కారణంగా మేలో పరిహారం దక్కే పరిస్థితి లేదు' అని మత్స్యశాఖ విశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ విజయ్‌కృష్ణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎన్నికల సంవత్సరం ఎప్పుడూ ఇంతే అంటూ ఆయన సమాధానం చెప్పారు. ప్రభుత్వం మారాక లేదా ఈ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చినా నవంబర్‌లో అందజేస్తారని తెలిపారు.

పరిహారం మాటేంటి ?

విశాఖ జిల్లా మత్స్యశాఖ అధికారుల రికార్డుల ప్రకారం 10500 మంది మత్స్యకారులు వేటకు వెళ్తుంటారు. ఈ జాబితాల ప్రకారం గడచిన ఐదేళ్లుగా రూ.10.50 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ అవుతోంది. ఈసారీ అంతే జమ కానున్నట్టు సమాచారం. జిల్లాలోని జాలరిపేట, రుషికొండ, సాగర్‌నగర్, పెద జాలరిపేట, వాల్తేరు, భీమునిపట్నం తదితర చోట్ల నుంచి వేటకు వెళ్లేవారంతా వేట నిషేధ కాలంలో ఇబ్బందులు పడనున్నారు.

అనకాపల్లి జిల్లాలో 73 కిలోమీటర్ల తీర ప్రాంతంలో 32 తీర గ్రామాలున్నాయి. 2,238 మోటార్ బోట్లలో సముద్రంలో చేపల వేటకు దాదాపు 15 వేల మంది మత్స్యకారులు వెళ్తున్నారు. వేట నిషేధంతో వీరి రోజువారీ ఆదాయానికి గండిపడినట్లయింది. నిషేధిత కాలానికి కుటుంబానికి చెల్లించే పదివేల రూపాయలు ఎప్పుడు చెల్లించేదీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో చేపల వేట నిషేధ కాలానికి సకాలంలో భృతి చెల్లింపు ప్రశ్నార్ధకంగా మారనుంది. మత్స్యకారులు గుర్తింపు, జాబితా తయారీ, నిధులు విడుదల సరిగా జరగకపోతే మత్స్యకారులకు నష్టం జరగనుంది. గతేడాది జిల్లాలో 10,750 కుటుంబాలకు పదివేల రూపాయలు చొప్పున జీవనభృతి కింద ప్రభుత్వం చెల్లించింది. ఈ ఏడాది ఇంకా ప్రభుత్వం నుంచి పరిహారం చెల్లింపుపై ఉత్తర్వులేవీ రాలేదని అధికారులు తెలిపారు.

యుసిడిలో ముగ్గురు సిఒలు సస్పెన్షన్

- ఎపిడికి షోకాజ్

- ఎన్నికల విధుల నుంచి తొలగించిన కలెక్టర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : యుసిడిపై వార్తా పత్రికల్లో వచ్చిన అభియోగాలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున తీవ్రంగా స్పందించారు. పలువురిపై వేటు వేశారు. నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌ను జరిగిన ఘటనలపై విచారణ అధికారిగా వేశారు. ఆయన అందించిన నివేదిక ఆధారంగా బాధ్యులందరిపై చర్యలు తీసుకున్నారు. వార్డు నెంబరు 17 సిఒ తిరుమలరావు, వార్డు నెంబరు 18 సిఒ నరసింహులు, వార్డు నెంబరు 19 సిఒ ఎస్‌వి.రమణలను ఈ మేరకు సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే జోన్-3 ఎపిడి దుర్గాప్రసాద్‌కు షోకాజ్ నోటీసు జారీచేస్తూ, ఎన్నికలకు సంబందించిన విధుల నుండి తొలగించినట్లు కలెక్టర్ చెప్పారు. వీరితో పాటు ఆర్‌పిలను కూడా వారి పోస్టుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ తన ప్రకటనలో శనివారం తెలిపారు.

నేడు బాబు ప్రజాగళం సభలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం పాయకరావుపేటలో జరగనున్న ప్రజాగళం సభలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పాయకరావుపేట జంక్షన్‌లో ఏర్పాటుచేసే సభలో మాట్లాడనున్నారు. అనంతరం సాయంత్రం ఏడు గంటలకు గాజువాక జంక్షన్‌లో జరగనున్న సభలో ప్రసంగిస్తారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మత్స్యకారులకు అండగా ఉంటామని రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఉదయం విశాఖ వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో మత్స్యకార ఆత్మీయ సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్స్యకారులను చంద్రబాబు అవమానించారని అన్నారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరకు వ్యతిరేకమని కూటమి నేతలు చెప్పగలరా ? అని ప్రశ్నించారు. ఉక్కు కర్మాగారంపై తన వైఖరి చెప్పిన తర్వాతే చంద్రబాబు ఆదివారం గాజువాకలో ఓట్లు అడగాలన్నారు. లాబీయింగ్ చేసే సిఎం రమేష్‌కు అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో బొత్స ఝాన్సీ, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ, దక్షిణ నియోజకవర్గం అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణంలో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మార్చాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారంలో వెనుకబడి పోయారని, ఆయనకు గెలిచే అవకాశం లేదని, వెంటనే అభ్యర్థిని మార్చాలని 39వ వార్డు జనసేన కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ పేర్కొన్నారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో, ఆయన మాట్లాడుతూ, దక్షిణంలో సర్వేలు వంశీకి ప్రతికూలంగా ఉన్నాయన్నారు. వంశీ దక్షిణంలో నాన్ లోకల్‌గా ప్రచారం సాగుతోందన్నారు. దీంతో జనసేన గెలవాల్సిన స్థానంలో ఒడిపోవాల్సిన దుస్థితి దాపురించిందని విచారం వ్యక్తం చేశారు. సానుభూతి కోసం పవన్ కల్యాణ్‌ను మోసం చేసినట్లు అధిష్టానానికి వివరించానని గుర్తు చేశారు. ప్రకాశం జిల్లా నుంచి వ్యాపారం నిమిత్తం విశాఖ వచ్చిన వంశీకృష్ణ శ్రీనివాస్ తనను బెదిరించడం హాస్యాస్పదం అన్నారు. విజయం సాధించాల్సిన దక్షిణ నియోజక వర్గం టికెట్ సమర్థులకే కేటాయించాలని కోరారు. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని, మత్స్యకార సెల్ నేత మూగి శ్రీనివాసరావు జనసేన పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నారన్నారు. స్థానిక అభ్యర్థికే టికెట్ ఇవ్వాలని కోరారు. మీడియా సమావేశంలో దక్షిణ నియోజకవర్గం జన సేన నేతలు సూరాడ తాతారావు, అర్జిల్ల మసేను, మశ్రుల్లా ఖాన్, ఎండి సలీం, బుక్కారీ ఖాన్, మోతి భాయ్, రాగతి భాను, పి.రమ, షేక్ అబిదా, కనక మహాలక్ష్మి, బొడ్డి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి మరడాన జగ్గునాయుడును, విశాఖ పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి అత్తిలి విమలను గెలిపించాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామన మూర్తి ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ ద్వారకా నగర్ జంక్షన్ వద్ద నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

కూటమి నేతల సమావేశం

ప్రజాశక్తి - గాజువాక : సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కిన గంగవరం పోర్టు కార్మికుల ఉద్యమానికి అండగా ఉంటామని టిడిపి గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. కూటమి పార్టీల ఆత్మీయ సమావేశం పాత గాజువాకలో జరిగింది.

87వ రోజుకు ఎంవివి పాదయాత్ర

ఎంవిపి.కాలనీ: తూర్పు నియోజకవర్గంలో శనివారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన పాదయాత్ర 87వ రోజు విశాఖ స్థానిక జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెం, శివగణేష్ నగర్‌లో చేపట్టారు.

విస్తృతంగా ముత్తంశెట్టి ప్రచారం

24న నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి చేపలుప్పాడ, కాపులుప్పాడ, కె.నగరపాలెం గ్రామాల్లో శనివారం స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 13న జరుగు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలను అత్యంత పారదర్శకంగా అర్హులకు అందజేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

24న నామినేషన్ దాఖలు : ముత్తంశెట్టి

ఈ నెల 24 వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో పరిపాలన వికేంద్రీకరణ జరిగిందని వివరించారు. కోవిడ్ సమయంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో వాలంటీర్ వ్యవస్థ ప్రధాన భూమిక పోషించినట్లు తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వైసిపిదే విజయం అని జోస్యం చెప్పారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు మండలంలోని మజ్జివలసలో జరుగు వైసిపి సభను జయప్రదం చేయాలని కోరారు.



మహిళకు వైసిపి బ్రోచర్‌ను అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విలేకర్ల సమావేశంలో ఎంపిపి డి.వాసురాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి.పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - ఆరిలోవ :నగరంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధి 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. శ్రీకృష్ణాపురం ఎదురుగా శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో చిన్నకాలువలో రాళ్ల మధ్య మృతదేహం ఉండడాన్ని స్థానిక యువకులు గుర్తించారు. ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిపి డాక్టర్ రవిశంకర్ అయ్యర్, ఎసిపి జయరాం ప్రసాద్, ఆరిలోవ సిఐ గోవిందరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసు జాగిలాలతో పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. ఆరిలోవ కాలనీ వెర్రిదుర్గానగర్‌కు చెందిన దనాల అమర్(35)గా గుర్తించారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు బయటకు వెళ్లిన అమర్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అమర్ గతంలో జివిఎంసి ఒప్పంద పద్ధతి డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో అతనిపై ఎటువంటి కేసులూ లేవని ప్రాథమిక సమాచారం. స్థానికంగా యువకులతో పెద్ద ఫాలోయింగ్ ఉన్న వ్యక్తి. యువకుల మధ్య చిన్న చిన్న గొడవల్లో తలదూర్చి సెటిల్ మెంట్లు చేయడం తప్ప అందరితో మంచిగా ఉండేవాడని స్థానికులు అంటున్నారు. ఆరిలోవ సిఐ గోవిందరావు ఆధ్వర్యాన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ శవాగారానికి తరలించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి -మునగపాక : మండలంలోని చూచుకొండ గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై ప్రసాదరావు తెలిపారు. శనివారం తమకు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.8 లక్షల 76 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

700 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏటిగైరంపేట పంచాయతీ ముంగర్లపాలెం గ్రామం శివారు పొలిమేరలో సారా బట్టీలపై ఎస్సై బి.కృష్ణారావు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 700 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎక్కడైనా సారా తయారు చేసినా, విక్రయించినా సమాచారం ఇవ్వాలని చెప్పారు.

జైభారత్ నేషనల్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : భీమునిపట్నం నియోజకవర్గం జై భారత్ నేషనల్ పార్టీ కార్యాలయాన్ని నగరంపాలెంలోని తన ఇంటి వద్ద ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇల్లిపిల్లి అనిల్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి పార్టీలో చేరానని, ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి -పద్మనాభం : తనకు అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని భీమిలి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాగోతు నాగమణి చెప్పారు. మండలంలోని అయినాడ, చిన్నాపురం, నేరెళ్లవలస, కొయ్యిపేట, తునివలస, రెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలున్నాయని, స్థానికులు ఎమ్మెల్యేగా గెలిస్తేనే వాటిని పరిష్కరించడానికి అవకాశముంటుందని చెప్పారు. ఇప్పటివరకు వలస పక్షులే నియోజకవర్గంలో పాలన సాగిస్తున్నాయని తెలిపారు. వారు స్వప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు తప్ప ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలేదన్నారు. దీన్ని ఓటర్లు గమనించి ఓటు వేయాలని కోరారు.

యువ క్రికెటర్లను వెలుగులోకి తెస్తాం

ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -పిఎం.పాలెం : రాష్ట్రంలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను వెలుగులోకి తెస్తామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా త్వరలో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి మెగా స్కూల్ క్రికెట్ లీగ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఆంధ్ర మాజీ క్రికెటర్స్ రీయూనియన్ 14వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ-విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం పలువురు మాజీ క్రికెటర్లు మ్యాచ్ ఆడారు. అనంతరం ఆంధ్ర మాజీ క్రికెటర్స్ రీయూనియన్ ఆధ్వర్యాన గోపీనాథ్‌రెడ్డిని సన్మానించారు. ఏసీఏ అధ్యక్షులు పి.శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి అందిస్తున్న సహకారాన్ని మరువలేమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మాజీ క్రికెటర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కెఎ.హుస్సేన్, జి.మోహన్, వివిధ జిల్లాల నుంచి రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ క్రికెటర్లు పాల్గొన్నారు.

ఆనందపురం మండలంలో గంటా ప్రచారం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం, వెల్లంకి, లోడగలవానిపాలెం, పాలవలస, ఆనందపురం, బంటుపల్లి వారి కల్లాలు పంచాయతీల్లో భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యాన ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలను ప్రారంభించి మొదటి ముఖ్యమంత్రి కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు అని తెలిపారు. రూ.2కే కిలో బియ్యం, వృద్ధులకు పెన్షన్, మహిళలకు ఆస్తి హక్కు, మహిళా రిజర్వేషన్, ఉచిత విద్య ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు భీమిలి నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు.

టిడిపి ఎన్నికల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధిలో టిడిపి ఎన్నికల కార్యాలయాన్ని గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014 నుంచి 2019 మధ్య కాలంలో స్థానిక ఎమ్మెల్యేగా, మంత్రిగా గంటా శ్రీనివాసరావు పనిచేసిన కాలంలో భీమిలి నియోజకవర్గాన్ని వివిధ రంగాల్లో చేసిన అభివృద్ధే ప్రస్తుత ఎన్నికల్లో గెలిపిస్తుందన్నారు. గంటా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచార సభలకు ప్రజల స్పందన చూస్తుంటే భారీ మెజారిటీతో విజయం సాధించడం తథ్యమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు, పార్టీ మండల అధ్యక్షులు డిఎవి.రాజు, నాయకులు బోర బంగారురెడ్డి, కారి అప్పారావు, చేపుల్ల శ్రీనివాస్, పాసి త్రినాథ కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఐరన్ మ్యాన్ పోటీల్లో కృష్ణ ప్రతిభ

ప్రజాశక్తి- తగరపువలస : ఐరన్ మ్యాన్ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని పలు పతకాలు సాధించిన నగరానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ పరవాడ కృష్ణను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శనివారం సత్కరించారు. స్థానిక చిప్పాడ దివీస్ సంస్థ పరిపాలన విభాగం కార్యాలయంలో దివీస్ సంస్థ ప్రతినిధుల సమక్షంలో జరిగిన సత్కార సభలో సిపి మాట్లాడుతూ, ఐరన్‌మ్యాన్ పోటీల్లో పాల్గొని వరుసగా 3 సార్లు పతకాలు సాధించిన కృష్ణ విశాఖ నగర పరిధి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుండడం తమకు ఎంతో గర్వ కారణంగా ఉందన్నారు. కృష్ణకు ఆర్థికంగా సహకారం అందిస్తున్న దివీస్ సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. దివీస్ సంస్థ మాన్యుఫాక్చరింగ్ డైరెక్టర్ డాక్టర్ సురెడ్డి దేవేందర్ మాట్లాడుతూ, తమ సంస్థ ఆర్థిక సహకారంతో అంతర్జాతీయ వేదికపై పాల్గొని రెండు సార్లు అత్యంత ప్రతిభ చూపి పతకాలు సాధించిన కృష్ణకు తమ సంస్థ తరఫున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రమేష్, దివీస్ సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ రమణ, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జోరుగా కెకె.రాజు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. జివిఎంసి 53వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్, శివనగర్ తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ బర్కత్ ఆలీతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సంక్షేమ పాలనకు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జు వెంకటరెడ్డి, నాయకులు భాకీశ్యామ్ కుమార్‌రెడ్డి, రాయుడు శ్రీను, షేక్ బాబ్జి, హనుమంత్, హైదిరాజు, పట్నాల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు సమక్షంలో పలువురు ముస్లిం నాయకులు వైసిపిలో చేరారు. వారికి కెకె.రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 53వ వార్డు మర్రిపాలెం ఎన్నికల కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, షేక్ మున్నా, ఎమ్‌డి నజీర్ ఉన్నారు.

సీతమ్మధారకు చెందిన జనసేన నాయకులు మాదేటి సురేష్ ఆధ్వర్యాన 100మంది జనసేన నాయకులు, కార్యకర్తలు కెకె.రాజు సమక్షంలో వైసిపిలో చేరారు.

యువతతో సమీక్ష

జివిఎంసి 26వ వార్డు పరిధి చాకలిపేట వద్ద గల ఎన్నికల కార్యాలయంలో యువతతో కెకె.రాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకట్రావు, బాణాల శ్రీనివాసరావు, నాయకులు బలుసు జగదీష్, ఎమ్.సునీల్, రేవతిరావు, బొడ్డేటి కిరణ్, పాల్గొన్నారు.

క్రైస్తవులతో ఆత్మీయ సమావేశం

జివిఎంసి 51వ వార్డు ఉడా కాలనీలోని గ్రాండ్ మిలాన్ ఫంక్షన్ హాల్లో కెకె.రాజుకు మద్దతుగా నియోజకవర్గం క్రైస్తవ సేవకులు, నాయకులు రెవరెండ్ పాల్ విక్టర్ నేతృత్వంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కెకె.రాజు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్. జేమ్స్, కార్పొరేటర్ రెయ్యి వెంకట రమణ, సేనాపతి అప్పారావు, ఎల్.శామ్యూల్, అనిల్ పాల్, జేమ్స్ మాత్యూస్, జార్జ్, పద్మాకుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



53వ వార్డులో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

46వ వార్డులో...

జివిఎంసి 46వ వార్డు పరిధి లక్ష్మీనారాయణపురంలో వైసిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జివిఎంసి డిప్యూటీమేయర్ కటుమూరి సతీష్, నాయకులు కార్యకర్తలు ప్రతి ఓటర్‌నూ కలిసి ఎమ్మెల్యే అభ్యర్థిగా కెకె.రాజును, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.గోవింద్, కె.చిన్నా, కె.రామారావు, దూది నర్సింగరావు, కె.ఈశ్వరరావు, కె.లావణ్య, ఎవి.రమణ, కె.శ్రీను, ఎన్.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్‌గా గీతం జట్టు

ప్రజాశక్తి-మధురవాడ : భోపాల్‌లోని సెజ్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్ షిప్ ఆధ్వర్యాన ఇటీవల జరిగిన వాలీబాల్ పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జట్టు మొదటి స్థానం సాధించి ఆల్ ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్‌గా నిలిచిందని క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. గీతం విద్యార్థులు గోలి సుజిత్, ఎస్.రోహిత్‌రాజ్, జి.సాయికార్తిక్, కె.హర్షిద్, ఎస్.సాయి శశిధర్, ఎన్‌జె.గణేష్ ప్రతిభ కనబరిచి (మొదటి స్థానం) నిలిచి బంగారు పతకాలను సాధించారని పేర్కొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో గీతం జట్టు చండీగఢ్ యూనివర్సిటీని బెస్ట్ ఆఫ్ 3 క్లాస్‌లలో 2-0 స్కోర్‌తో ఓడించిందని వివరించారు.

అంబేద్కర్ బౌద్ధ చైతన్య భావజాల గీతాల సీడీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జనచైతన్యమండలి 40ఏళ్ల ఉద్యమ ప్రస్థానం సందర్భంగా అంబేద్కర్ 133వ జయంతి నేపథ్యంలో శనివారం రామా టాకీస్ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ బౌద్ధ చైతన్య భావజాల గీతాల సీడీని ఆవిష్కరించారు. సంస్థ వ్యవస్థాపకుడు పెయ్యల పావనప్రసాద్ రాసిన ఈ గీతాలకు సంగీత దర్శకుడు జాన్ సంగీతాన్ని అందించారు. జోహార్ బాబాసాహెబ్ అంబేద్కరా... భరతమాత ముద్దుబిడ్డ నీవే. దేశానికి రక్షణ కవచం అంబేద్కర్ తత్వం కాదా.., మను ధర్మం మంట కలిపి పోరాడవే చెల్లి.. లాంటి 16 పాటలను పలు సంఘాల నాయకులు ఆవిష్కరించారు. సంస్థ ప్రతినిధి పి .రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెయ్యల పావన ప్రసాద్, బి.కళ్యాణరావు గూడూరు సీతామహాలక్ష్మి, కొత్తపల్లి వెంకటరమణ, డాక్టర్ బండి సత్యనారాయణ, బూసి వెంకటరావు, మల్లయ్య రాజు, డాక్టర్ కాశీ రామారావు, పంతగడ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతికి ఏర్పాటు

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి, పద్మనాభం జంక్షన్, పాండ్రంగి గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈర్ల ఈశ్వరరావు దళితవాడ నాయకులను కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా : గుడివాడ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం ఆర్యవైశ్యులకు అండగా ఉంటామని, వారి సమస్యలను పరిష్కరిస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య ప్రతినిధులతో శనివారం అమర్‌నాథ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజువాకలో వ్యాపారులు తమ కార్యకలాపాలను సజావుగా సాగించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట రామయ్య, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు కలుకూరి మంగరాజు, నంబూరి జగన్నాథరావు, కేసారపు శ్రీనురమేష్, సతీష్, నగేష్ బాబు, శరత్ తదితరులు పాల్గొన్నారు..

ఇంటర్ ఫలితాల్లో శ్రీనవోదయ ప్రతిభ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటర్ ఫలితాల్లో శ్రీ నవోదయ జూనియర్ కాలేజీ విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారని కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ భీశెట్టి రాము తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ శనివారం కాలేజీలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిపుణులైన అధ్యాపక బృందం నిబద్ధత వల్లే ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. 2014లో ప్రారంభించిన తమ కాలేజీ నానాటికీ మెరుగైన ఫలితాలు సాధిస్తోందన్నారు. రెండవ సంవత్సరం ఎంపిసిలో టి.సాత్విక 984 మార్కులు, జె.రాణిరెడ్డి 979, కె.భరత్ 976, బైపిసిలో పి.మేనక 980 మార్కులు, కె.కృష్ణ భవాని 978 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో కె.సత్యసాయి ప్రసీద 458 మార్కులు, యు.లావణ్య 457 మార్కులు, బైపిసిలో బి.హేమమాధురి 431, ఎం.ప్రవల్లిక 428, ఎన్.ప్రేమకుమారి 426 మార్కులు సాధించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి తమ అధ్యాపక బృందంతో కలిసి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ భీశెట్టి రాము, డీన్ మురళీప్రసాద్ భీశెట్టి, డైరెక్టర్లు భీశెట్టి విశ్వకీర్తి, భీశెట్టి భవాని, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందజేసి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్ భీశెట్టి రాము

విశాఖ పోర్టుతో సమానంగా వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ పోర్టుతో సమానంగా అదానీ గంగవరం పోర్టులో వేతనాలు చెల్లించాలని ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సమస్యలపై గంగవరం పోర్టు కార్మికులు తలపెట్టిన ఆందోళన శనివారానికి నాలుగో రోజుకు చేరుకుంది. కార్మికులు విధులు బహిష్కరించి పోర్టు గేటు సమీపంలో పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకూ కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. వారికి జగ్గునాయుడు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. గంగవరం పోర్టులో ఇస్తున్న వేతనాలతో కార్మికులు జీవితాలను నడుపుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న విశాఖ పోర్టులో కొత్తగా జాయిన్ అయిన వారికి బేసిక్ రూ.36,000 ఇస్తుండగా, ఇక్కడ మాత్రం 16 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు రూ.15 వేలకు అటుఇటుగానే వస్తోందన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. 2024 ఇంక్రిమెంట్‌లో వేతనాలను పెంచి విశాఖ పోర్టుకు సమానంగా జీతం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆన్ డ్యూటీలో మరణించిన కార్మికులకు సరైన నష్టపరిహారం అందించకుండా యాజమాన్యం ఆ కుటుంబాలను రోడ్డున పడేస్తోందని తెలిపారు. కార్మికులంతా హక్కులు సాధించుకునే వరకూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, నాయకులు గంటిపిల్ల అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, సత్యానందం, స్వామి పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద..

విశాఖ కలెక్టరేట్ : గంగవరం పోర్టు కార్మికుల పోరాటానికి మద్దతుగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. గంగవరం పోర్టు నిర్మాణం వల్ల అక్కడి వారు భూములు, చేపల వేట, ఉపాధి కోల్పోయారన్నారు. అటువంటి వారికి అన్యాయం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, నాయకులు పి.వెంకటరెడ్డి, జివిఎన్.చలపతి, జి.అప్పలరాజు, ఎం.సూరీడు పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టు కార్మికుల ఆందోళనలో జగ్గునాయుడు



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందిస్తున్న గంగారావు తదితరులు

కలెక్టర్‌కు గంగారావు వినతి

అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.గంగారావు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పోర్టులలో మాదిరిగానే గంగవరం పోర్టు కార్మికులకూ రూ.36 వేలు వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల 15 డిమాండ్లనూ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్ పాల్గొన్నారు.

కలెక్టర్ చర్చలు

గ్రేటర్ విశాఖ బ్యూరో : గంగవరం పోర్టు కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్మిక సంఘాలతో చర్చించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆందోళనలకు ఇది సరైన సమయం కాదని అన్నారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామని, వారు కొంత సమయం కోరారని కలెక్టర్ వివరించారు. అంతవరకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని, ఆందోళనను జూన్ 4 వరకూ వాయిదా వేసుకోవాలని అన్నారు. పోర్టులో ఇన్ని సమస్యలు ఉంటే ఎందుకు ఇన్నాళ్లు పరిష్కారానికి కృషి చేయలేదని పోర్టు యాజమాన్య ప్రతినిధులను కలెక్టర్ ఈ సమావేశంలో మందలించారు. కార్మికులు, వారి నాయకులతో ఎప్పటికప్పుడు సమావేశం అయితే సమస్యలు ఉండవు కదా? అని అన్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, గంగవరం పోర్టు సిఇఒ అమిత్ మాలిక్, డిసిపి లా అండ్ ఆర్డర్ సత్తిబాబు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పోరాటం చేసే పార్టీని గెలిపించాలి



శీలానగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : పోరాటం చేసే పార్టీని గెలిపించాలని ఇండియా ఫోరమ్ బలపరిచిన సిపిఎం గాజువాక నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 71వ వార్డు సుందరయ్య కాలనీ చర్చ్ ఫాదర్ ఇమాన్యుల్ రాజును, అరుణోదయ కాలనీ చర్చి ఫాదర్ మోహన్‌రావును కలిశారు. తర్వాత సిపిఎం సీనియర్ నాయకులు వీరభద్రను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, గంగవరం పోర్టు కాలుష్యంపై పోరాటం చేస్తున్నామని చెప్పారు. గాజువాక ఇనాం భూమి సమస్యపై పోరాటం చేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, జోన్ కమిటీ సభ్యులు ఎస్.కృష్ణమూర్తి, ఎస్.శ్రీను, డి.శ్రీను, గంగాధర్, ఇమ్మానియేల్, లోకేష్, నాయనబాబు, వెంకట్రావు మొదలగువారు పాల్గొన్నారు.

శీలానగర్‌లో ఇంటింటి ప్రచారం

శీలానగర్‌లో శనివారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడుకు ఓటు వేయాలని సిపిఎం నాయకులు కోరారు. శీలానగర్‌లో రోడ్డుపై చిరు వ్యాపారాలు చేస్తున్న వారిని కూడా కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, ఐద్వా నాయకులు, సత్యవతి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ముదపాకలో స్వతంత్ర అభ్యర్థి గుంటూరు ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : ముదపాకలో పెందుర్తి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న గుంటూరు వెంకట నరసింహమూర్తి శనివారం ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను స్థానికుడినని, ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలు తనకు తెలుసని, గెలిస్తే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ప్రజా గొంతుకను అసెంబ్లీకి పంపుదాం

ప్రజాశక్తి కరాస: ధన రాజకీయాలను ఓడించి ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న ఇండియా ఫోరమ్ అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీలో ప్రజా గొంతుక వినపడేందుకు కృషిచేస్తామని ప్రజాసంఘాల నేతలు స్పష్టం చేశారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ సిపిఐ అభ్యర్థి అత్తిలి విమల అభ్యర్థిత్వాన్ని బలపర్చుతూ పౌర ప్రజాసంఘాల నేతలు మద్రిపాలెంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలకు ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. విభజన సమయంలో కేంద్రం ప్రకటించిన హామీలు అమలుకాలేదని, వాటిని సాధించేందుకు ప్రస్తుత అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలం చెందాయని విమర్శించారు. స్వప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన వైసిపి, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ భూసి వెంకట్రావు, పౌర ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పి.చంద్రశేఖర్, ఐద్వా నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు సోడిదాసు సుధాకర్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం మన్మధరావు, నాయకులు ఎస్‌కె.రెహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, జి వామనమూర్తి, ఎన్.నాగభూషణరావు, ఎమ్‌డి.బేగం, అధ్యక్షులు వనజాక్షి, పుష్పలత, ప్రజా నాట్య మండలి నాయకులు దేవుడమ్మ, ఎ.రవి, క్షేత్రపాల్ పాల్గొన్నారు.



లక్ష్మీనగర్‌లో ప్రచారం చేస్తున్న ఆడారి మాలతి

ఆనంద్‌కుమార్ సతీమణి ప్రచారం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు పరిధి లక్ష్మీనగర్, రామకృష్ణనగర్‌లో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సతీమణి ఆడారి మాలతి, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు పేడాడ రమణి కుమారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో కొంతసేపు ముచ్చటించారు. రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆడారి ఆనంద్ కుమార్‌ను విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.

10వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు కొండవాలు ప్రాంతమైన బిఎన్‌ఆర్ నగర్‌లో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, రాజశేఖర్ ఆధ్వర్యాన శనివారం టిడిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావుతో కలిసి ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, ఏడువాక సన్యాసిరావు, గాడు అప్పలనాయుడు, గాడి సత్యం, మద్దిల రాజేష్, కేతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలను ఆనుకొని గుడారాల్లో కార్మిక కుటుంబాల నివాసం

- సిఐటియు నేత గనిశెట్టి సందర్శన
- విచారణ జరిపించాలని డిమాండ్
- ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్ఇజెడ్ లేబర్ ఆఫీసర్ రమ్య

ప్రజాశక్తి- పరవాడ

పరవాడ ఫార్మా సిటీ రాంకీ ఎస్ఇజెడ్‌లోని ప్రమాదకర రసాయనిక పరిశ్రమలను ఆనుకొని ఎటువంటి సౌకర్యాల్లేని, గుడారాల్లో ఒడిశాకు చెందిన 150 కార్మిక కుటుంబాలు నివాసముంటున్న ప్రాంతాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ శనివారం సందర్శించి పరిశీలించారు. అక్కడ కార్మిక కుటుంబాలతో మాట్లాడారు. మహిళలు, చిన్నారులతో ఏ విధమైన సౌకర్యాలు లేకుండా భద్రత లేకుండా జీవనం సాగిస్తున్న వైనాన్ని చూసి చలించిపోయారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కడుపు చేత పట్టుకొని భార్య పిల్లలతో వలస వచ్చిన కార్మికులు ఇక్కడ దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు లేకపోవడంతో మలవిసర్జనకు ఆరుబయటకే మహిళలు చిన్నారులు వెళ్తున్నారన్నారు. మహిళలకు ఇలాంటి ప్రాంతంలో రక్షణ ఎవరు కల్పిస్తారని ప్రశ్నించారు. గతంలో అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో ఒక మహిళపై అత్యాచారం చేసి హత్య చేశారని, అయినా జిల్లా అధికారులు పరిశ్రమల వద్ద ఇలాంటి గుడారాలు ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎస్ఇజెడ్ డెవలప్మెంట్ కమిషనర్, కార్మిక శాఖ, పోలీస్, రెవెన్యూశాఖలు విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని, కార్మిక కుటుంబాలకు తగిన వసతి, సౌకర్యాలు కల్పించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.



గుడారాల వద్ద చిన్నారులతో సిఐటియు నేత గనిశెట్టి



గుడారాల్లో నివాసముంటున్న వారితో మాట్లాడుతున్న రమ్య

కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, కార్మిక హక్కులు, చట్టాలను కాపాడాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఇజెడ్ లేబర్ ఆఫీసర్ రమ్య సంబంధిత గుడారాలను శనివారం పరిశీలించారు. దీనిపై పూర్తి విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. వీటిపై పరవాడ సిఐ బాల సూర్యారావు, ఎస్ఇజెడ్‌లోని గుడారాలను సందర్శించి విచారణ చేస్తామన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కశింకోట



రిజ్వానా

కశింకోట విశ్వభారతి కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ మళ్ల జగదీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ ఇంటర్ ఎంపిసీలో రిజ్వానా 463, బైపీసీలో జాహ్నవి 419, సిఇసిలో కుసుమ 467 మార్కులు సాధించడంతో పాటు 10 మంది విద్యార్థులు 400 పైబడి మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ద్వితీయ ఇంటర్ ఎంపిసీలో గాయత్రి 948, బైపీసీలో సౌమ్యశ్రీ 952 మార్కులు సాధించడంతో పాటు 10 మంది విద్యార్థులు 900 పైబడి మార్కులు సాధించినట్లు వెల్లడించారు. వీరికి కరస్పాండెంట్ మళ్ళ జగదీష్, ప్రిన్సిపాల్ నానాజీ, కాలేజ్ డైరెక్టర్ సన్యాసిరావు, సూర్య, కెవివి సత్యనారాయణ అభినందనలు తెలిపారు



రాజీనామా పత్రాలు అందిస్తున్న వాలంటీర్లు

25 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

ఎలమంచిలి మున్సిపాలిటీ పెద్దపల్లి సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 25 మంది వాలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి కష్ట సమయంలో ప్రాణాలకు తెగించి తాము పని చేశామని తెలిపారు. ఎన్నికల నిబంధనల కారణంగా వాలంటీర్లను విధులకు దూరంగా పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు గ్రామాల్లో ఇరుగుపొరుగు వారితో మాట్లాడిన సమయంలో ఫోటోలు తీసి తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా కన్నబాబురాజును ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలిపారు.



శేఖర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ధనలక్ష్మి తదితరులు

శేఖర్ కుటుంబానికి సిఐటియు నేతలు పరామర్శ

ప్రజాశక్తి- అచ్యుతాపురం

అచ్యుతాపురంలో లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన గొల్లపల్లి శేఖర్ కుటుంబ సభ్యులను శనివారం సిఐటియు వివోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఆమె వెంట విఓఎ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కె సోము నాయుడు ఉన్నారు.

విభజన రాజకీయాలు చేస్తున్న మోడీ

ఎఐసిసి పరిశీలకులు మనోజ్ చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత మనోజ్ చౌహాన్

ప్రజాశక్తి -అచ్యుతాపురం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలతో సమాజాన్ని విడదీస్తూ విభజన రాజకీయాలు చేస్తుందని ఏఐసిసి పరిశీలకుల మనోజ్ సోహన్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం అచ్యుతాపురంలో హ్యాపీ ఫంక్షన్ హాల్‌లో డిసిసి అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఇందులో పాల్గొన్న మనోజ్ చౌహాన్ కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న హామీలను ప్రజలు నమ్ముతున్నారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో హామీలు అమలుకు ముఖ్యమంత్రి తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజల్లో విద్వేషాన్ని, ప్రాంతీయ, కుల, మత తత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి దేశంలో శాంతి లేకుండా చేస్తుందని విమర్శించారు. ప్రేమను పంచడాలనే సంకల్పంతో రాహుల్ గాంధీ ముందడుగు వేశారని, ఆయన బాటలో దేశ ప్రజలు నడవడానికి ముందుకొస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థులు ఐఆర్ గంగాధర్, పి.భగత్, గుత్తుల శ్రీరామ్మూర్తి, బోకు తాతారావు, నాయకులు ఎల్ రామారావు, జగన్నాథం, తనకాల అనంతరావు, ఎన్‌వీఆర్ రాహుల్, కే అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డేడ మురళి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళీకృష్ణ జన్మదిన వేడుకలు పార్లమెంట్ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మురళిని శాలువాతో సత్కరించి, మెమొంటోను పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు నాగ జగదీష్ బహూకరించారు. అనంతరం కేక్ కటింగ్ చేయించి మురళికి తినిపించారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ మురళి కుటుంబం తెలుగుదేశం ఆవిర్భావం నుండి పార్టీకి ఎల్లవేళలా సేవలందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బోలిశెట్టి శ్రీనివాసరావు, కడిమిశెట్టి నరసింగరావు బోడి వెంకటరావు, కొప్పి రామకృష్ణ, కుప్పిలి జగన్, విల్లూరి రమణబాబు, మల్ల గణేష్, మల్ల శివన్నారాయణ, గుడాల సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణ, షేక్ బాబర్, తలారి ప్రసాదు, పూడి త్రినాథ్, బొడ్డేడ శ్రీనివాస్, బివిఎస్ అప్పారావు బుద్ధ శ్రీనివాసరావు, దొడ్డి జగదీష్, డివివి అప్పారావు, శ్రీరామదాసు గోవింద, కొణతాల అప్పలరాజు పాల్గొన్నారు.



బొడ్డేడ మురళి కృష్ణను సత్కరిస్తున్న టిడిపి నేతలు

మద్యపాన నిషేధం పేరుతో రూ.లక్ష కోట్లు లూటీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మద్యపాన నిషేధం పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష కోట్ల రూపాయలు లూటీ చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యంతో వేల మంది మహిళల మంగళసూత్రాలను తెంచిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. జే బ్రాండ్ల ద్వారా దోచుకున్న లక్షల కోట్ల డబ్బును కంటైనర్ల ద్వారా వైసీపీ నాయకులు ఎన్నికలకు తరలించారని ఆరోపించారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేస్తుందన్నారు. మద్యపాన నిషేధంపై హామీ ఇచ్చిన జగన్ రెడ్డి నేటికీ ఒక్క డీ- అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించలేదన్నారు. అవినీతి చేయడం కోసమే మద్యం అమ్మకాల్లో డిజిటల్ పేమెంట్లను నిషేధించారని, జగన్ హయాంలో మద్యం బ్లాక్ మార్కెట్ లో విచ్చలవిడిగా సరఫరా అవుతోందని మండి పడ్డారు. ఈ సమావేశంలో జనసేన, బిజెపి నాయకులు శ్రీరామదాసు గోవింద, కొణతాల అప్పలరాజు పాల్గొన్నారు.

రిక్షా కార్మిక సంఘం నేత కోనకు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి :రిక్షా కార్మిక సంఘం నాయకుడు, అనకాపల్లి మండలం మూలపేట గ్రామానికి చెందిన కోన సత్యనారాయణకు పలువురు శనివారం ఘనంగా నివాళులర్పించారు. సత్యనారాయణ కుమారుడు, ఏఐటీయూసీ నేత కోన లక్ష్మణ ఇంటి వద్ద జరిగిన సంతాప సభ అనకాపల్లి రిక్షా కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి ఐఆర్ గంగాధర్, సమాజ్ వాది పార్టీ అభ్యర్థులు కోన గురవయ్య, ఒమ్మి వెంకట యాదవ్, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు నాయకులు శ్రీరామ్, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, బిజెపి నేత కొణతాల అప్పలరాజు, మూలపేట గ్రామ పెద్దలు చేవ్వకుల ఈశ్వరరావు, పలక విష్ణు, పలువురు ఎంపీటీసీలు సర్పంచ్‌లు పాల్గొని నివాళులర్పించారు. సత్యనారాయణ సాధారణ రిక్షా కార్మికుడిగా జీవితం ప్రారంభించి రిక్షా కార్మిక సంఘ నాయకుడిగా ఎదిగి ఎన్నో పోరాటాలు చేశారని పలువురు కొనియాడారు.

భరత్ సతీమణి నివేదిత ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌కు మద్దతుగా ఆయన సతీమణి నివేదిత శనివారం జివిఎంసి 80వ వార్డు పరిధిలో ఆ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. 80వ వార్డు పరిధిలోని పల్లపు వీధి, బుద్ద ప్రకాష్ రావు నాయుడు వీధి, అరుంధతి నగర్‌లో ఇంటింటికి వెళ్లి తన భర్త భరత్ కుమార్‌కు ఒక్క అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడును గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొణతాల మురళీకృష్ణ, కాండ్రేగుల రాము, పెంటకోట సన్యాసినాయుడు, ఆళ్ల శంకర్, పెట్ల నాగేశ్వరరావు, మద్దాల సురేష్, కర్రి కిరణ్, విల్లూరి శివసూరి, కేవీఎమ్.నాయుడు, వేగి త్రినాథ్ పాల్గొన్నారు.

82వ వార్డులో....

జీవీఎంసీ 82వ వార్డు పరిధి గాంధీనగరంలో ఆ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు ఆధ్వర్యంలో శనివారం వైసిపి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌లకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కె.రవీంద్ర, జిఎస్ఆర్ శర్మ, బిఎల్ఎన్ శర్మ, ఎ.రాజు, పిళ్లా నరసింహరాజు, ఆకుల సంతోష్, మల్ల జయరాం, పలక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న భరత్ సతీమణి నివేదిత తదితరులు

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న బిజెపి అభ్యర్థి సిఎం రమేష్‌పై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఎం రమేష్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చోడవరంలో జిఎస్టీ అధికారులపై తన ప్రతాపం చూపారని, ప్రశాంతమైన అనకాపల్లిలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రచారంలోనే ఈ విధంగా వ్యవహరిస్తే రేపు గెలిస్తే అనకాపల్లి అసాంఘిక శక్తుల నిలయంగా మారుతుందని పేర్కొన్నారు. ఎన్ని వాహనాలకు అధికారుల నుండి అనుమతులు తీసుకున్నారో లెక్కలేదన్నారు. మునగపాకలో అధికారుల తనిఖీలో సిఎం రమేష్‌కు చెందిన వాహనాన్ని పర్మిషన్ లేదని సీజ్ చేశారని గుర్తు చేశారు. ఇలాంటి పర్మిషన్ లేని వాహనాలు ఎన్ని వున్నాయో తెలియదన్నారు. ధన పంపిణీ కూడా విస్తారంగా జరుగుతున్నట్లు ప్రజలు చెబుతున్నారన్నారు. యలమంచిలి మండలం సోమలింగపాలెంలో మద్యం పట్టుపడినట్లు దిన పత్రికల్లో వచ్చిందని, ఇప్పటి వరకు అది ఎవరితో అధికారులు తేల్చలేదని పేర్కొన్నారు. ఇది కూడా బిజెపి కూటమి అభ్యర్థిదే అనే అనుమానాలు ప్రజల నుండి వ్యక్తమౌతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రచార వాహనాలకు పర్మిషన్లు వున్నాయో లేదో అధికారులు తనిఖీ చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సౌండ్ సిస్టంకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వున్నాయో లేదో చెక్ చేయాలని కోరారు. జిల్లా అధికారులు వెంటనే అప్రమత్తమై ఎన్నికల నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని లోకనాథం విజ్ఞప్తి చేశారు.


అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట

కసింకోట మండల అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక బిసి బాలుర వసతి గృహం వద్ద శనివారం అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగి నంబా రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు అంబేద్కర్, శివలంక జగ్గారావు, ఊడిగల నరసింహారావు, పావాడ సన్యాసిరావు, ఎం.కామేశ్వరరావు, కరణం సూర్యప్రకాష్, డి.సత్యారావు, శివలంక సత్యనారాయణ, టి.కృష్ణ పాల్గొన్నారు,

ఎన్‌టిఆర్ ఆసుపత్రి పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు శనివారం పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పేషెంట్లకు పెట్టే భోజనంలో నాణ్యత లేదని, సరిపడినంతగా పెట్టడం లేదని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సింగ్ సిబ్బంది పేషంట్లపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వైద్య సిబ్బంది ఎమర్జెన్సీ కేసులను తక్షణమే టేకప్ చేయకుండా కేజీహెచ్‌కి రెఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. గడువు తీరిన మందులను ఇస్తున్నారన్నారు. పారిశుద్ధ కార్మికులకు 2 నెలలుగా, సెక్యూరిటీ సిబ్బందికి 3 నెలలుగా జీతాలు ఇవ్వటం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఆసుపత్రి అధికారి లక్ష్మణ్ శ్రీనివాస్, వైద్యులతో ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు చర్చించారు. ఈ పరిస్థితి మారకపోతే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బొడ్డు సోమరాజు, ముగడ అప్పారావు పాల్గొన్నారు.

నూకాలమ్మను దర్శించుకున్న సీతారాం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారిని ఎపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్లు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. వికలాంగ పిల్లలు, చంటి పిల్లలతో దర్శించుకునేందుకు వచ్చే కుటుంబ సభ్యులకు ఎటువంటి దర్శనం ఏర్పాట్లు చేశారో అడిగి తెలుసుకున్నారు. తల్లులు పాలు పెట్టేందుకు ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటుపై ఆరా తీశారు. అమ్మ వారి జాతరలో బాలల హక్కులకు ఎక్కడ విఘాతం కలిగినా కమిషన్ తనదైన శైలిలో వ్యవహరిస్తుందని సీతారాం హెచ్చరించారు.

గ్రామాల్లో సుందరపు ప్రచారం

ప్రజాశక్తి- మునగపాక

ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం రాత్రి మండలంలోని చూచుకొండ, గణపర్తి గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాసు, కమలం పువ్వు గుర్తులను మహిళలకు అందిస్తూ ఈ గుర్తులపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధం చేసిన తర్వాతే ఓట్లు అడుగుతానన్న ముఖ్యమంత్రి ఇప్పుడు ఏం ముఖం పెట్టుకొని జనాల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్

ఎన్‌డిఎ కూటమి, వైసిపి అభ్యర్థులను ఓడించాలి


మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, జనసేన, టిడిపి కూటమిని, వైసిపి అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఈ పదేళ్లలో దేశాన్ని సర్వ నాశనం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, ప్రత్యేకహోదా, విశాఖకు రైల్వే జోన్, పోలవరం నిర్మాణానికి నిధులు, ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు ఇవ్వకుండా ఆంధ్రా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. అటువంటి దగా కోరు బిజెపితో జతకట్టిన టిడిపి జనసేనతోపాటు రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో ప్రజలను అన్ని విధాలుగా నాశనం చేసిన వైసిపి ప్రభుత్వానికి తెగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు, వనము సూర్యనారాయణ, గోగాడి ఈశ్వరమ్మ, రాజు, మహేష్, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.


టిడిపి నాయకులు, కార్యకర్తలతో పైలా ప్రసాదరావు

టిడిపి శ్రేణులతో పైలా సమావేశాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఎ.కొత్తపల్లి, ముసిడిపల్లి, కొత్తూరు ముత్యాలమ్మపాలెం, చిన నందిపల్లి, ఎన్.గజపతినగరం గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలతో మాడుగుల నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు శనివారం సమావేశాలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించారు. ఈ సమావేశాల్లో ఎ.కొత్తపల్లి మాజీ సర్పంచ్ పెద్దాడ వెంకటరమణ, కంచిపాటి రాజునాయుడు, ముసిడిపల్లి మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద, చిన్ననందిపల్లి మాజీ సర్పంచ్ పూడి సత్యారావు, ఎన్ గజపతినగరం నాయకులు పాసిల కృష్ణ, కొత్తూరు ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్ గంధం జగ్గారావు, వాకపల్లి మాజీ ఎంపీటీసీ పెంగటి సింహాచలం నాయుడు, లెక్కల సత్యనారాయణ, పోతల నాయుడు, బండారు శ్రీను, గేదెల ఎర్నాయుడు, పెంటకోట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల జీవితాలను నాశనం చేసిన జగన్

ప్రజాశక్తి- అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీర్లు జీవితాలను నాశనం చేశారని అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతల రామకృష్ణ ఆరోపించారు. మండలంలోని వెంకుపాలెం, తగరంపూడి, మెట్టపాలెం, జగన్నాధపురం, సీతానగరం గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతల మాట్లాడుతూ వాలంటీర్ల పార్టీలకు అతీతంగా డబ్బుకు ప్రలోభ పడకుండా పనిచేస్తే రాబోయే కూటమి ప్రభుత్వంలో వారికి జీతం రూ.10వేలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ

అచ్చర్లలో ప్రచారం

కశింకోట : మండలంలోని అచర్ల గ్రామంలో జనసేన అభ్యర్థి కొణతల రామకృష్ణ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం వెనుకబడిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, గొంతిని శ్రీనివాసరావు, నైనమశెట్టి రమణరావు, దొడ్డి నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు పొన్నగంటి అప్పారావు పాల్గొన్నారు.

ప్రలోభాలకు వైసిపి నేతలు లొంగరు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

టిడిపి కూటమి నేతల ప్రలోభాలకు వైసీపీ నేతలు ఎవరూ లొంగరని జెడ్పిటిసి దొండా రాంబాబు అన్నారు. శనివారం బుచ్చయ్యపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తనను కూడా వ్యక్తిగతంగా కూటమి నేతలు ప్రలోభ పెట్టేందుకు విఫల యత్నం చేశారన్నారు. కూటమి నేతలు హుందాగా వ్యవహరించాలని హితవుపలికారు. కడప నుండి వచ్చిన సీఎం రమేష్ డబ్బుతో ఇక్కడి ఓటర్లను కొనలేరన్నారు. గేదెల సత్యనారాయణ విషయంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ కఠిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

16న వారాహి యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -అచ్యుతాపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈనెల 16న మంగళవారం అచ్యుతాపురం జంక్షన్ వద్ద నిర్వహించే వారాహి యాత్రను విజయవంతం చేయాలని ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అచ్యుతాపురంలో శనివారం జరిగిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18న ఎమ్మెల్యేగా నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు చెప్పారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ మూడు పార్టీల నాయకులు సీఎం రాజేష్, రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, దాడి ముసిలి నాయుడు, కె విజయబాబు, దూళి రంగనాయకులు, రాజాన సన్యాసినాయుడు, బుడగపాక పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యాపారాలు తొలగించాలి

- సిఐ బుచ్చిరాజు ఆదేశం

ప్రజాశక్తి- అచ్యుతాపురం

ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా అచ్యుతాపురం జంక్షన్‌లోని ప్రధాన రహదారులపై సాగిస్తున్న వ్యాపారాలు తొలగించాలని స్థానిక సిఐ ఎం.బుచ్చిరాజు ఆదేశించారు. అచ్యుతాపురం జంక్షన్‌లో బెంజ్ లారీ కింద ముగ్గురు దుర్మరణం చెందిన నేపథ్యంలో ప్రమాదాలు అరికట్టడానికి పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. శనివారం సిఐ ఆధ్వర్యాన పోలీసులు పూడిమడక, అనకాపల్లి, గాజువాక, ఎలమంచిలి మార్గాల్లో రోడ్డుపై అక్రమంగా వ్యాపారాలు సాగిస్తున్న వారిని తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఎవరూ వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలో అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ

మండలంలోని కొత్తఎల్లవరం గ్రామానికి చెందిన 10 వైసిపి కుటుంబాలు శుక్రవారం సాయంత్రం జనసేన పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గండెం దొరబాబు, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలో కుమార్‌పురం గ్రామానికి చెందిన విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడు రాజాన అప్పలకొండ, ఎస్ఇజెడ్ లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజాన నాగేశ్వరరావు తమ అనుచరులతో శనివారం జనసేన పార్టీలో చేరారు. వారికి ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికలలో విజయకుమార్ గెలుపునకు పనిచేస్తామని అప్పలకొండ చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బయలుపూడి శ్రీరామదాసు, కూండ్రపు రమణ, పైల రామునాయుడు, కూనిశెట్టి రమణ, బొందల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్, జూనియర్ కళాశాలల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-గొలుగొండ: శుక్రవారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితల్లో కృష్ణదేవిపేట జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ గ్రూపునకు సంబంధించి రామోజు భారతి (951), షేక్ తనీషా (949), కొప్పోజు ప్రసన్న సాయిదుర్గ (810) ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ గ్రూపునకు సంబంధించి టి.వరలోవ శంకర్ (436), బైపీసీ గ్రూపుకు సంబంధించి జి. నీలిమ (396), సిహెచ్. సుప్రియ (394) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరైన 98 మంది విద్యార్థులకు గాను 28 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరైన 109 మందికి 79 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీహరి తెలిపారు.

వేములపూడి కళాశాల విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లిడెస్క్: ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో నర్సీపట్నం మండలం వేములపూడి ఏపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కెఎస్‌డి.సంధ్య మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 81 శాతం, ద్వితీయ సంవత్సరంలో 79 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసీ విభాగంలో 470 మార్కులకు గాను 460, 443, 437, 432 మార్కులు, బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను 426, 422, 421, 420, 418 మార్కులు, సిఇసి విభాగంలో 500 మార్కులకు గాను 381 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే ద్వితీయ సంత్సరం ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను 922, బైసిపి విభాగంలో 948, సిఇసి విభాగంలో 835 మార్కులు గరిష్టంగా సాధించారన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా ఫస్ట్ సాధించిన సౌమ్య

అనకాపల్లిడెస్క్: వెటర్నరీ కోర్సు (ఒకేషనల్) ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నర్సీపట్నం సాన్ ఒకేషనల్ కళాశాలకు చెందిన బి. సౌమ్య 941/1000 మార్కులతో జిల్లా ఫస్ట్‌గా నిలిచింది. అదే కళాశాలకు చెందిన రుత్తల దివ్య 868/1000 మార్కులతో జిల్లా సెకండ్‌గా నిలిచిందని కళాశాల కరస్పాండెంట్ సూరెడ్డి ఉమా మహేశ్వరీ తెలిపారు.





నివాళి అర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు, తదితరులు

ఘనంగా శారదా నికేతన్ వార్షికోత్సవం

-విలువైన విద్యను అందించడమే లక్ష్యం

-శారదా నికేతన్ వ్యవస్థాపకులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- అరకులోయ : ఏజెన్సీ ప్రాంతంలో విలువైన విద్యను అందించడమే శారదా నికేతన్ లక్ష్యమని శారధ నికేతన్ వ్యవస్థాపకులు సిహెచ్ నర్సింగరావు తెలిపారు. అరకులోయలోని శారదా నికేతన్ పాఠశాలలో శనివారం 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ, పాఠశాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. మరింత మెరుగు పడే విధంగా విద్యను అందించాలని కోరారు. విద్యను మించిన ఆస్తి లేదని, దీని ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించి జ్ఞానం పెంపొందించడమే శారదా నికేతన్ ప్రధాన లక్ష్యమన్నారు.

రిటైర్డ్ పంచాయతీరాజ్ శాఖ ఈఈ పల్లం రాజు మాట్లాడుతూ, అత్యంత వెనుకబడి ఏజెన్సీ ప్రాంతంలో శారదా నికేతన్ పాఠశాలను నెలకొల్పి ఆహ్లాదకరమైన వాతావరణంలో స్కూల్‌ను నిర్వహించడం పై అభినందించారు. ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను గిరి పుత్రులకు అందించడంతో దేశ భవిష్యత్తుకు పునాది వేసిన వారు అవుతారని తెలిపారు. గుణాత్మకమైన విద్య అందించడంతో సమాజానికి మేలు జరుగుతుందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే సత్ప్రవర్తన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించే విధంగా, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యను అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బి.ప్రభావతి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని బాలబాలికలకు విద్యను అందించడమే శారద లక్ష్యమన్నారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. అందరి సహకారంతో శారదా ట్రస్ట్ నడుస్తుందని పేర్కొనానన్రు.శారదా నికేతన్ 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అల్లరింపచేసాయి. ఎల్‌కేజీ పిల్లల నుంచి టెన్త్ క్లాస్ పిల్లల వరకు వేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ చిరంజీవి అధ్యక్షత వహించని కార్యక్రమంలో ఆ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కిల్లో సురేంద్ర, వి.ఉమామహేశ్వరరావు, జెవి స్వామి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి జి. రమణ, టి.రత్నాలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాటను వేస్తున్న పద్మావతి

ఘనంగా మరిడిమహాలక్ష్మి రాట ఉత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో ఈ నెల 23న నిర్వహించే మరిడి మహాలక్ష్మీ అమ్మవారి జాతర సందర్భంగా శనివారం రాట మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి చేతుల మీదుగా రాటను వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈనెల 15న మొదటి జాగారం, 17న రెండవ జాగారం, 19న పెద్ద జాగారం నిర్వహిస్తామన్నారు. 23న అత్యంత ఘనంగా జాతరను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్తఎల్లవరం గ్రామంలో శుక్రవారం రాత్రి మాజీ మంత్రి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎన్నికల శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపికి చెందిన 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా వారందరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన నాయకులు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేట పంచాయతీకి చెందిన 20 కుటుంబాలు మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ ఆద్వర్యంలో శనివారం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ 20 కుటుంబాలు గతంలో పాతమల్లంపేట పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ శంఖారావం సభలో ఆ పార్టీలో చేరి వారే మళ్ళీ వైసిపిలోకి రావడం విశేషం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, సచివాలయం కన్వీనర్ కొరుప్రోలు పాణి శాంతరాం, చీడిగుమ్మల ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోట మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పండ్రాని శేషు బాబు, దాసరి శ్రీను శనివారం విశాఖ డైయర్ డైరెక్టర్ మలసాల రమణారావు సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి మలసాల రమణారావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ విధానాలు నచ్చి ఆ పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. రమణారావు మాట్లాడుతూ అనకాపల్లిలో భరత్ కుమార్, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం



ప్రచారం చేస్తున్న జోగులు, బాబూరావు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల, జి.కొత్తూరు, డి.కొత్తూరు గ్రామాల్లో శనివారం పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు పాల్గొని గ్రామంలో పర్యటించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, నాయకులు అల్లు రమణ, నల్లల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: సంక్షేమ పాలన కోసం వైసీపీకి మద్దతు ఇవ్వాలని నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ 7, 8 వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేస్తూ వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అనంతరం గణేష్ విలేకరులతో మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు ఎంత సేపు వందల కోట్ల సంపాదించడంపైనే దృష్టి పెట్టారు కానీ నియోజకవర్గంలో అధిక జనాభా గల పెద్ద మండలంగా ఉన్న నాతవరంలో జూనియర్ కళాశాలను తీసుకురావాలనే ఆలోచన చేయలేదన్నారు. కానీ వైసీపీ హయాంలో జూనియర్ కళాశాల మంజూరు అయిందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గం 30వేల మెజార్టీతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైసీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాడుగుల సీటుపై పునరాలోచించాలి

-మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు



మాట్లాడుతున్న రామానాయుడు

ప్రజాశక్తి - చీడికాడ: మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సీటుపై అధిష్టానం సర్వేలు జరిపించి ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు కోరారు. మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, మాడుగుల నియోజకవర్గంలో 111 పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తలు, ఓటర్లతో సర్వేలు జరిపించి బలమైన నాయకుడికి ఎమ్మెల్యే సీటును ప్రకటించాలని రామానాయుడు అభ్యర్థించారు. గతంలో ఈ టికెట్ పై చంద్రబాబును సంప్రదిస్తే పార్టీని బలోపేతం చేసిన నాయకుడికి ప్రకటిస్తామని చెప్పారని, ఎటువంటి సర్వేలు జరపకుండా పార్టీతో సంబంధం లేకుండా ఎత్తులు వేసే నాయకుడికి టికెట్ ప్రకటించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్టానం నిర్ణయం మేరకు నియోజకవర్గంలో బాదుడే బాదుడు, రాష్ట్రానికి ఇదేం కర్మ, బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో కాకుండా అనేక నిరసనలు చేపట్టి నియోజకవర్గంలో పార్టీకి ఊపిరి పోశానన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలలో చైతన్యం వచ్చిందని, ఈ తరుణంలో తనను కాదని గుర్తింపు లేని నాయకుడికి ఎమ్మెల్యే సీటు ప్రకటించడంతో పార్టీ ఉనికిని కోల్పోతుందని తెలిపారు. ఈ నెల 15న నియోజకవర్గ స్థాయిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తానని రామానాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో గవిరెడ్డి సన్యాసినాయుడు, సర్పంచ్ కొల్లి సూర్య నాయుడు, ఎంపీటీసీ ముత్యాల నాయుడు, రైతు సంఘం నాయకుడు గొల్లవెల్లి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



ఇవిఎంలను తరలిస్తున్న అధికారులు

నక్కపల్లికి చేరుకున్న ఇవిఎంలు

ప్రజాశక్తి -నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి అవసరమైన ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య శనివారం సాయంత్రం నక్కపల్లికి తీసుకువచ్చారు. ప్రత్యేక వాహనంలో 350 బ్యాలెట్ యూనిట్లు, 350 కంట్రోల్ యూనిట్లు, 379 వివి ప్యాడ్‌లు నక్కపల్లికి చేరుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. గీతాంజలి పర్యవేక్షణలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లో బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ పాడ్స్ వున్న బాక్సులను భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద రౌండ్ ది క్లాక్ పోలీస్ బందోబస్తు వుంటుందని ఆర్వో గీతాంజలి, సీఐ విజయ్ కుమార్ తెలిపారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో ఈ బాక్సులను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ఓ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ చైనులు, హెచ్ఎటీ సత్యనారాయణ, టీడీపీ, బీజేపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, కోసూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు అంబేద్కర్

- నేడు ఆ మహనీయుని జయంతి
- విశాఖలో ఆయన పేరిట పలు ఉద్యమ కేంద్రాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : డాక్టర్ బిఆర్.అంబేద్కర్. ఈ పేరు వింటే చాలు ఓ రకమైన ఉత్తేజం. స్ఫూర్తి. ఆయన పేరు తలచుకుంటే చాలు తెలియని ఉత్సాహం. కలబడి నిలబడాలన్న తెగువ. ఇంతలా అందరినీ ప్రభావితం చేసిన అంబేద్కర్.. భారతదేశ రాజ్యాంగ నిర్మాత... న్యాయ నిపుణుడు... రాజకీయ నాయకుడు... ఆర్థికవేత్త... మంచి ఉపాధ్యాయుడు... గొప్ప ఉపన్యాసకుడు... ప్రముఖ సంపాదకుడు... ప్రసిద్ధ రచయిత... వెరసి బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వయం కృషి, స్వీయ ప్రతిభతో ఎంతో ఎత్తుకెదిగిన మహావ్యక్తి. అంటరానితనం, కులతత్వం, సామాజిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక అసమానతలు రూపుమాపడానికి తన జీవితాంతం పోరాడిన యోధుడు. సమాజాన్ని మౌలికంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారాలు సూచించిన మేధావి. అందుకే ఆయన అణగారిన వర్గాల ఆశాజ్యోతి... యావజ్జాతికి వైతాళికుడు. నేడు ఆ మహనీయుని జయంతి. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆయన పేరిట ఉన్న ఉద్యమ కేంద్రాలను ఓసారి జ్ఞప్తికి తెచ్చుకుందాం.

విశాఖ నగరంలోని ఎల్ఐసి భవనం సమీపంలోని అంబేద్కర్ నిలువెత్తు విగ్రహం, ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం ఉద్యమ కేంద్రాలని చెప్పొచ్చు. ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్, బిర్లా కూడలి, రెల్లివీధి జంక్షన్, అల్లిపురం జివిఎంసి పాఠశాల ప్రాంతం, తాటిచెట్ల పాలెం, నెహ్రూ బజార్ ఇలా నగరంలో పలు ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలు ఆకర్షణీయంగా, దళితుల పాలిట ఆశాజ్యోతిగా విరాజిల్లుతున్నాయి. విశాఖ పోర్టుకు సమీపంలో జ్ఞానాపురం వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం నేడు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. బుల్లయ్య కాలేజీని ఆనుకొని ఉన్న అంబేద్కర్ భవనం ఎంతో ప్రసిద్ధిగాంచినది.

అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలకు, బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లునూ పూర్తి చేసినట్టు కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు బి.కల్యాణ్‌రావు, జెవి.ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఎల్ఐసి కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల అలంకరణ చేసి నివాళ్లర్పిస్తామన్నారు. అనంతరం అంబేద్కర్ బుద్ధ విహార్ ఫౌండేషన్ డే ఉత్సవాలు, సాయంత్రం నాలుగు గంటలకు ఎల్ఐసి కూడలి నుండి అంబేద్కర్ భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కరుణరాజు, విశిష్ట అతిథిగా భారత్ బచావో ఆల్ ఇండియా వైస్ చైర్మన్ డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్, జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్ కుమార్, కెజిహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున్, డిఎంఇ పాడేరు డాక్టర్ పి.విశ్వమిత్ర, ఎసిపి త్రినాధ్, డాక్టర్ టి.జయరాజ్ హాజరవుతారని తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో కోశాధికారి జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఇంటి గురుమూర్తి, కె.సాధు, అలమండ ప్రసాద్, కాంతారావు, సరస్వతి పాల్గొన్నారు.